సాక్షి
కుమురం భీం
శనివారం, 21, జూన్, 2025



ఆలయానికి దారేది?

9లో▸

బెజ్జూర్ మండల కేంద్రానికి 3 కిలోమీటర్ల దూరంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. సరైన రోడ్డు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

ఐదెకరాల వరకు 'రైతు భరోసా'



ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఐదెకరాల వరకు భూమి గల రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రైతు భరోసా నగదు జమ చేసిందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 1,42,386 మంది రైతులకు రూ.264.30 కోట్ల పెట్టుబడి సాయం అందించినట్లు పేర్కొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
35.2 /27.6

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో ఒకటి, రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆరోగ్య యోగా

- నిరంతర సాధనతో మానసిక, శారీరక ప్రశాంతత
- రోగ నిరోధక శక్తి పెరుగుదలకు దోహదం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలకు మానసిక ప్రశాంతత కరువైంది. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లతో యువతను సైతం రోగాలు సైతం చుట్టుముడుతున్నాయి. ఈ తరుణంలో మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా సాధన కీలకంగా మారింది. ప్రస్తుతం చిన్నాపెద్దా తేడా లేకుండా యోగాసనాలు సాధన చేస్తున్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..



కౌటాలలో యోగసనాలు వేస్తున్న విద్యార్థులు

మినీ స్టేడియంలో ఆకట్టుకున్న ఆసనాలు

కౌటాల: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో శుక్రవారం జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన యోగాసనాలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో గావుడే హన్మంతు మాట్లాడుతూ యోగా సాధనతో రోగాలు దరి చేరవన్నారు. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు డి.సురేశ్, ఏవో ప్రేమలత, సహకార సంఘం చైర్మన్ కె.మాంతయ్య, యోగా శిక్షకులు దాసరి వినోద్, దౌలత్ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో భాగం కావాలి


- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు



కాగజ్‌నగర్‌టౌన్: యోగా మనిషి జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ యోగా డేలో పాల్గొని మాట్లాడారు. ప్రపంచానికి భారత దేశం ఇచ్చిన గొప్ప వరం యోగా అన్నారు.

ఆసనాల్లో అద్భుత ప్రతిభ

- శిక్షకుడిగా రాణిస్తున్న దినేశ్ పురి



యోగా చేస్తున్న దినేశ్ పురి

కెరమెరి(ఆసిఫాబాద్): ఆయన తన పన్నెండో ఏటా నుంచి యోగాసనాలపై మక్కువ పెంచుకున్నారు. కఠిన సాధన చేస్తూ కష్టమైన ఆసనాలు సులువుగా చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. అంతేకాక అనేక యోగా పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలు, పతకాలు కైవసం చేసుకున్నారు మండల కేంద్రానికి చెందిన యోగా శిక్షకుడు దినేశ్ పురి. కెరమెరి మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్ పురి, సునంద దంపతుల్లో చిన్నకుమారుడు దినేష్ పురికి ఆటలపై ఆసక్తి ఉండేది. కెరమెరిలోనే 1 నుంచి 8 తరగతి వరకు చదువుకోగా, ఆదిలాబాద్‌లో 9, 10, హైదరాబాద్‌లో ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. ఆ తర్వాత బెంగుళూరులోని ఎస్ వ్యాస యూనివర్సిటీలో యోగాపై శిక్షణ పొందారు. వివిధ ఆసనాలు సులువుగా వేయడం సాధన చేశారు. 2019లో సిద్దిపేటలో జరిగిన ఆరో తెలంగాణ స్టేట్ లెవల్ యోగా చాంపియన్‌షిప్ పోటీలు, బెంగళూరులో జరిగిన జాతీయ, అంతర్జాతీయ హిమాలయ యోగా ఒలంపియాడ్ పోటీల్లో పాల్గొని ప్రశంసపత్రాలు అందుకున్నారు. అదే ఏడాది పలు దేశాలకు చెందిన యోగా నిపుణులతో బెంగుళూరులో జరిగిన ప్రపంచస్థాయిలో పోటీలకు హాజరయ్యారు. మొత్తం 90 మందితోపాటు పాల్గొని ప్రతిభ చూపారు. హైదరాబాద్‌లో అనేకమంది విద్యార్థులకు యోగా పాఠాలు నేర్పారు. 2024 డిసెంబర్ నుంచి ఆయుష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆయుష్మాన్ యోగా మందిర్‌లో విద్యార్థులు, స్థానికులకు యోగాపై శిక్షణ కల్పిస్తున్నారు. ఉదయం, సాయంత్రం రెండు గంటలపాటు సాధన చేయిస్తున్నారు. గత నెల 27 నుంచి ఈ నెల 20 వరకు కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆశ వర్కర్ల, ఏఎన్‌ఎంలు, తహసీల్దార్ కార్యాలయంలోని సిబ్బంది, పోలీసులు, విభిన్న వర్గాలకు యోగాతో కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

బరిలోకి దిగితే పతకమే..



రెబ్బెన: మండలంలోని గోలేటికి చెందిన పత్తెం నిహారిక యోగాలో జాతీయ స్థాయిలో రాణిస్తోంది. 3వ తరగతి చదువుతుండగానే యోగా సాధన ప్రారంభించి అతి చిన్న వయస్సులోనే పట్టు సాధించింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి.. ఏ పోటీ అయినా బరిలోకి దిగిందంటే పతకం సాధించాల్సిందే. తల్లి వద్ద నుంచి యోగా సాధనలో ఓనమాలు నేర్చుకుని ఇప్పటివరకు మూడు జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించింది. తల్లిదండ్రులు రాజు, అలేఖ్య తమ ఇద్దరు పిల్లలకు యోగా శిక్షణ అందించారు. చిన్న కుమార్తె నిహారిక ప్రధానంగా చక్రాసన, టిట్టిబాసన, కౌడిన్య ఆసన, మిడిల్ స్ప్లిట్ వంటి ఆసనాలు వేయడంలో దిట్ట. 2022లో మొదటిసారి గోలేటిలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో అండర్- 10 విభాగంలో నిహారిక బంగారు పతకం సాధించింది. ఔరంగబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా చాంపియన్‌షిప్, బెల్లంపల్లిలో నిర్వహించిన 34వ ఇండియా న్యూ ట్రెడిషనల్ యోగా నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ బంగారు పతకం సాధించింది.

రోజంతా యాక్టీవ్‌గా..



మొదట ఆసనాలు వేయాలంటే కష్టంగా ఉండేది. మా గ్రామంలో యోగా క్లాస్‌లకు వెళ్లి నేర్చుకున్నాను. ఇటీవల బెల్లంపల్లిలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాను. యోగా చేయడం ద్వారా రోజంతా యాక్టీవ్‌గా ఉంటున్నాను. యోగాసనాలు క్రమంగా చేస్తే జ్ఞాపకశక్తి పెరుగుతోంది.

– నికాడే యశ్విత, గురుడుపేట, కౌటాల

ప్రతిరోజూ సాధన..



రెబ్బెన: సింగరేణి యాజమాన్యం 2015లో యోగా శిక్షణపై అవగాహన కల్పించడంతోపాటు ఉచితంగా శిక్షణ సైతం ప్రారంభించడంతో నేను శిక్షణ తీసుకున్నారు. నాలుగేళ్లపాటు గురువు రాజలింగు, రాజ్యలక్ష్మి వద్ద సాధన చేశా. 2019 నుంచి సింగరేణి ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో సంస్థ ఉద్యోగులు, అధికారులకు యోగాసనాలు నేర్పిస్తున్నాను. 2015 నుంచి ఇప్పటివరకు ప్రతిరోజూ గంటకు పైగా సాధన చేస్తా. నిరంతర యోగా సాధనతో మానసిక ప్రశాంతత పెరుగుతుంది. ఏకాగ్రత, రోగ నిరోధక శక్తి వృద్ధి చెందుతుంది. కరోనా సమయంలో మా బంధువులను చాలా మందికి పాజిటివ్ వస్తే ఆస్పత్రులకు తీసుకెళ్లాను. రోగ నిరోధక శక్తి అధికంగా ఉండటంతో మహమ్మారి నుంచి తప్పించుకున్నా.

– కనుకుంట్ల సుధ, శిక్షకురాలు

యోగాతో ఆరోగ్యం



కౌటాల: నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారు. దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలి. మనస్సు ప్రశాంతంగా ఉండటంతోపాటు దీర్ఘ కాలిక వ్యాధులు దరిచేరవు. చిన్నారుల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతుంది. జన భవిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కౌటాల మినీ స్టేడియంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తాం.

– దాసరి వినోద్‌గౌడ్, యోగా శిక్షకుడు, కౌటాల

న్యూస్‌రీల్

25న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడాపాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈ నెల 25న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, యువజన క్రీడల అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం మండలస్థాయిలో రాణించిన విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం జూలై 1 నుంచి 5 వరకు రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని వెల్లడించారు. 01- 09- 2016 నుంచి 30- 08- 2017 మధ్య జన్మించిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 80080 90626 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తప్పుడు ధ్రువపత్రాల ఆరోపణలపై విచారణ

ఆసిఫాబాద్‌రూరల్: తప్పుడు ధ్రువపత్రాలతో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి రావురి శ్రీనివాస్‌రావుపై వచ్చిన ఆరోపణల మేరకు విచారణ చేపట్టినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ తెలిపారు. తదుపరి చర్యల కోసం జిల్లా కలెక్టర్ ద్వారా డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(హైదరాబాద్)కు నివేదిక అందించామని పేర్కొన్నారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వివరించారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం



మంజూరు పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్సీ విఠల్

కాగజ్‌నగర్‌టౌన్: ఇందిరమ్మ ఇళ్ల పథకంతో రాష్ట్రంలోని పేదల సొంతింటి కల సాకారమవుతుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పట్టణంలోని 5, 14, 15, 29, 27 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుక్రవారం మంజూరు పత్రాలు అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలందరికీ పథకం అమలు చేస్తామన్నారు. ప్రజలు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగిర్, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

లక్కీడ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో 2025- 26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేశామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం లక్కీడ్రా నిర్వహించారు. పీవీటీజీ తెగలకు నాలుగు సీట్లు, ఏజెన్సీ గ్రామాలకు చెందిన విద్యార్థులకు నాలుగు సీట్లు, జనరల్ కేటగిరీలో 30 సీట్లు భర్తీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీడీవో రమాదేవి, ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు పాల్గొన్నారు.

సహకార సంఘాలు బలోపేతం

ఆసిఫాబాద్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న ప్రత్యేక చట్టాలతో వ్యవసాయ సహకార సంఘాలు బలోపేతం అవుతున్నాయని నాబార్డు డీడీఎం వీరభద్రుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ సహకార కార్యాలయంలో శుక్రవారం ఇంటర్నేషనల్ కోఆపరేటీవ్ ఇయర్ డే నిర్వహించారు. డీసీవో బిక్కు నాయక్, డీసీసీబీ మేనేజర్ అనిల్‌కుమార్, సీఈవో వెంకటరమణ, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. యోగా సాధనకు ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని సూచించారు.

26 వరకు వారోత్సవాలు

ఆసిఫాబాద్‌రూరల్: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 20 నుంచి 26 వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కళా ప్రదర్శనలు, మొక్కలు నాటడం, యోగా డే, పోస్టర్ల ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణ సదుపాయం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి రుణ సదుపాయం కల్పిస్తోందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేసి, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నామన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ 170 లక్ష్యం కాగా, ఇప్పటివరకు 12 వారు లింకేజీ పూర్తిగా చేశారని తెలిపారు. మిగిలిన 158 సంఘాలకు సంబంధించిన ప్రక్రియ కూడా త్వరగా చేపట్టాలన్నారు. కొత్తగా వివాహమైన వారిని గ్రూపుల్లో సభ్యులుగా చేర్పించి, నూతన సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన మంత్రి స్వనిధి, సమృద్ధి నిధి, విశ్వకర్మ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మోతీరాం, డీటీడీవో రమాదేవి, అదనపు డీఆర్‌డీవో రామకృష్ణ, డీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు అండగా ఉంటాం



పోషకులతో సమావేశమైన అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో కోవిడ్- 19 సమయంలో అనాథలుగా మారిన చిన్నారులకు అండగా ఉంటామని జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్, డీసీపీవో మహేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలల రక్షణ భవనంలో శుక్రవారం అనాథ పిల్లల పోషకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కోవిడ్ కారణంగా అనాథలైన ఏడుగురు చిన్నారుల చదువు, సంక్షేమం పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. స్పాన్సర్‌షిప్ పథకం కింద నెలకు రూ.4వేల నగదుతోపాటు పుస్తకాలు, యూనిఫాం, షూలు అందజేస్తామని తెలిపారు. పీఎంకే పథకం కింద నమోదైన వీరికి 23 ఏళ్ల నిండిన తర్వాత రూ.10లక్షల ఆర్థికసాయం అందుతుందన్నారు. బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో వారి సంరక్షణ చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం సిబ్బంది శ్రావణ్‌కుమార్, చంద్రశేఖర్, నవీన్ తదితరలు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంగెం ప్రకాశ్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి సీహెచ్‌పీలో నెలకొన్న సమస్యలు యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సంగెం ప్రకాశ్‌రావు అన్నారు. గోలేటి సీహెచ్‌పీలో ఐఎన్‌టీయూసీ నాయకులు శుక్రవారం పర్యటించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీహెచ్‌పీలో ఆర్వో ప్లాంటు చెడిపోవడంతో కార్మికులకు శుద్ధం జలం అందడం లేదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. మోటర్ వెహికల్ డ్రైవర్లు సరిపడా లేకపోవడంతో ఫస్ట్ షిఫ్ట్‌లో ఒకే డ్రైవర్‌తో లోడర్, క్రేన్ నడిపిస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు విధులకు గైర్హాజరు అయితే.. పెనాల్టీ విధించే పద్ధతిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మ్యాన్ పవర్‌కు తగినట్లుగా షేడేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు సదాశివ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గట్టయ్య, నాయకులు కొవ్వూరి శ్రీకాంత్, శ్యాంబాబు, రాజయ్య, అర్జయ్య పాల్గొన్నారు.

ప్రవేశాల్లో వెనుక'బడి'..

- జిల్లాలో ఫలితమివ్వని 'బడిబాట'
- లక్ష్యం 7,093.. అడ్మిషన్లు 2,079
- తెరుచుకున్న ఏడు 'మూత'బడులు



పునఃప్రారంభమైన రింగన్‌గూడ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం అధికారులు అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయింది. ప్రతీ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. సరైన సౌకర్యాలు లేక, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల లేక చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతుండడమే కారణం.

కొత్త అడ్మిషన్లు 2,079 మాత్రమే..

2025-26 విద్యాసంవత్సరంలో ఈ నెల 6నుంచి 19వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఆవాస ప్రాంతాల నుంచి ఐదేళ్లు నిండిన 2,079 మంది బాలలు సర్కారు బడుల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలు పొందారు. గతేడాది ఒకటో తరగతిలో 4,009 మంది ప్రవేశాలు తీసుకోగా ఈసారి ఆ సంఖ్య సగానికి పడిపోయింది. ప్రైవేట్ పాఠశాలల నుంచి 324 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. రెండోతరగతి నుంచి 10వ తరగతి వరకు 849 మంది ప్రవేశాలు పొందారు. జిల్లాలో నిర్వహించిన సర్వే ప్రకారం 7,093 మంది ఐదేళ్లు పూర్తి చేసుకున్న బాలలు ఒకటో తరగతిలో చేరాల్సి ఉండగా 2,079 మంది మాత్రమే ప్రవేశాలు తీసుకున్నారు. లక్ష్యం పూర్తి చేయాలంటే ఇంకా 5,014 మందిని చేర్పాల్సి ఉంది. అలాగే గతంలో విద్యార్థుల సంఖ్య లేని కారణంగా జిల్లా వ్యాప్తంగా 36 పాఠశాలలు మూతబడ్డాయి. బడిబాట సందర్భంగా జిల్లాలో ఏడు పాఠశాలలు తెరుచుకున్నాయి. ఆసిఫాబాద్ మండలంలోని కొమ్ముగూడ, రింగన్‌గూడ, గొల్లగూడ, బాబాపూర్ తండా, కాగజ్‌నగర్ మండలంలోని వల్లకొండ, సిర్పూర్(టి) మండలంలోని రావణ్‌పల్లి, వాంకిడిలోని దేవాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను తెరిపించారు. మిగతా 29 పాఠశాలలు తెరిపించేందుకు చర్యలు చేపట్టాల్సి ఉంది.

సంతోషంగా ఉంది



గతేడాది మా ఊరిలో పాఠశాల లేక మా పిల్లలు రెండు కిలోమీటర్ల దూరంలోని చిర్రకుంట పాఠశాలకు పోయేవారు. దూరం కారణంగా కొందరు ఇంటి వద్దే ఉండేవారు. ఊరిలోని బడి తెరవడం సంతోషంగా ఉంది.

– హనుమంతు, రింగన్‌గూడ

మా పిల్లలు చదువుకుంటున్నరు



మా ఊరిలో పాఠశాలను తెరిపించడంతో ఊరిలోని 16మంది విద్యార్థులు ప్రస్తుతం చదువుకుంటున్నారు. మూతబడిన పాఠశాలను తెరిపించడం మాకు ఎంతో సౌకర్యంగా ఉంది. మా పిల్లలను రోజూ పంపిస్తాం.

– రాము, రింగన్‌గూడ

నాలుగు స్కూళ్లు తెరిపించాం

ఆసిఫాబాద్ మండలంలో ఇప్పటివరకు మూతబడిన నాలుగు పాఠశాలలను తెరిపించాం. మరికొన్ని పాఠశాలలు తెరిపించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను చేర్పించి సౌకర్యాలు వినియోగించుకోవాలి.

– సుభాష్, ఎంఈవో

ఆరోగ్య రక్షణకు యోగా శిబిరాలు



ఉద్యోగులతో కలిసి యోగాసనాలు వేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు యోగా శిబిరాలు నిర్వహిస్తున్నామని జీఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఏరియాలో అన్ని గనుల డిపార్టుమెంట్లలో శుక్రవారం యోగా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఉద్యోగులు, అధికారులతో కలిసి జీఎం యోగాసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులు యోగా సాధన చేస్తూ ఆరోగ్యమైన జీవన విధానానికి బాటలు వేసుకోవాలని సూచించారు.

నేడు మెగా యోగా క్యాంప్

గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మెగా యోగా క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు జీఎం విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎస్వోటుజీఎం రాజమల్లు, అధికారులతో కలిసి యోగా క్యాంపు నిర్వహించే మైదానాన్ని పరిశీలించారు. ఏర్పాట్లతోపాటు మొక్కలు నాటే ప్రదేశాన్ని పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమాల్లో అధికారుల సంఘం నాయకులు ఉజ్వల్‌కుమార్ బెహరా, ఏరియా ఇంజినీర్ రామనాథం, సివిల్ డీజీఎం ఎస్‌కే మదీనా బాషా, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, పర్చేస్ అధికారి రవికుమార్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న శ్రీజ, వరుణ్




ఆసనాలు వేస్తున్న శ్రీజ, వరుణ్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు జిల్లాస్థాయి యోగా పోటీల్లో రాణిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. పీడీ ఇమ్రాన్ రెండేళ్లుగా విద్యార్థులకు యోగాలో మెళకువలు నేర్పిస్తూ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. గతేడాది డిసెంబర్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని శ్రీజ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. ఎనిమిదో తరగతి విద్యార్థి వరుణ్ గతేడాది సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు.



అసాధ్యాలన్నింటినీ సుసాధ్యం చేసే మహోన్నత శక్తి యోగాకు ఉంది. ఈ భారతీయ పురాతన ప్రక్రియకు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. ఇది ఎందరో ఆచరించి ప్రయోజనం పొందుతున్న దివ్య సాధనం. నిత్య జీవితంలో తప్పనిసరిగా మారిన శాస్త్రీయ వ్యాయామ సమ్మిళిత సంపద. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కథనం..

ఒంటికి యోగా మంచిదేగా..

- అన్ని వర్గాల్లోనూ పెరుగుతున్న ఆసక్తి • నేడు నిత్యజీవితంలో భాగమైన వైనం
- మానసిక ప్రశాంతతకు దివ్య ఔషధం • ఆరోగ్యకర జీవనానికి ప్రయోజనకరం
- వ్యాయామ సాధనాల సమాహారం • నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా గురువులకు కేరాఫ్ ఇలేగాం

భైంసా/భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం యోగా గురువులకు కేరాఫ్‌గా నిలుస్తోంది. పలువురు యోగా నేర్చుకుని ఉపాధిమార్గంగా మలుచుకున్నారు. అబ్దుల్ మతీన్ యోగా సాధన చేస్తూ గ్రామానికి చెందిన పలువురికి శిక్షణ ఇచ్చాడు. ఇతని వద్ద యోగా నేర్చుకున్న ఉప్పు రవీందర్, సీహెచ్ వీరన్న, గంగాధర్, కృష్ణకుమార్, పోతన్న డిగ్రీ పూర్తయ్యాక బెంగూళూర్‌లోని వ్యాస యూనివర్సిటీలో యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. అబ్దుల్ మతీన్ పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించగా, రవీందర్, వీరన్న, పోతన్న ఇటీవల ఆయుష్ విభాగంలో యోగా శిక్షకులుగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. కృష్ణకుమార్ హైదరాబాద్‌లో ఉంటూ ఆన్‌లైన్ ద్వారా విదేశాల్లోని ఔత్సాహికులకు యోగాలో శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. గంగాధర్ హైదరాబాద్‌లో యోగా శిక్షణ ఇస్తూ జీవనం సాగిస్తున్నారు.

బాసరలో శిక్షణ ఇస్తున్న



బాసరలో యోగా శిక్షణ ఇస్తున్న. పాఠశాల పిల్లలంతా జాతీయ స్థాయిలో రాణించారు. నేను చిన్నప్పుడు హైస్కూల్‌లో చదివేటప్పుడు యోగాసనాలు నేర్చుకున్నా. అవే ఆసనాలు నన్ను కోచ్‌గా మార్చాయి. ప్రస్తుతం ఎంతోమంది పిల్లలకు శిక్షణ ఇస్తున్న. యోగా నాకు ఆరోగ్యంతో పాటు ఉపాధినిస్తోంది. ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేస్తే ఏ ఇబ్బందులు ఉండవని సూచిస్తున్నా.

– కోకినోళ్ల మల్లేశ్

22ఏళ్లుగా సాధన



2003 నుంచే యోగా సాధన ప్రారంభించాను. 15సార్లు జిల్లాస్థాయిలో, 10 సార్లు రాష్ట్ర స్థాయిలో, ఏడుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొన్నాను. ప్రస్తుతం నిజామాబాద్ యోగా అసోసియేషన్‌లో కార్యదర్శిగా, తెలంగాణ యోగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. యోగా సాధనతో ఇప్పటివరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరలేదు.

– గంగాధర్, ఇలేగాం

ఆయుష్‌లో ఉద్యోగం



నేను 14 ఏళ్లుగా యోగా శిక్షకుడిగా చేస్తున్నాను. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను. నా వద్ద యోగా నేర్చుకున్న విద్యార్థులు పలుసార్లు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించారు. ఫిబ్రవరిలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా రిఫరీ డిప్లమో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాను. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అశోక్ అగర్వాల్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నాను. ప్రస్తుతం ఆయుష్ విభాగంలో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్న.

– ఉప్పు రవీందర్, ఇలేగాం

ఉపాధినిచ్చింది



నేను 2005 నుంచి యోగా సాధన ప్రారంభించాను. గురువు అబ్దుల్ మతీన్ వద్ద యోగా నేర్చుకున్నాను. డిగ్రీ తరువాత యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశాను. 2016లో ప్రణవ అథ యోగా ఇనిస్టిట్యూట్‌ను సొంతంగా ప్రారంభించి దాదాపు 300 మందికి శిక్షణ ఇచ్చాను. యోగా థెరపిస్ట్‌గా పనిచేస్తున్నాను. ఇటీవలే ఆయుష్‌లో యోగా శిక్షకుడిగా ఉద్యోగం పొందాను. యోగాతో ఆరోగ్యంతోపాటు ఉపాధి లభించింది.

– సీహెచ్ వీరన్న, ఇలేగాం

ఢిల్లీలో శిక్షణ ఇస్తున్న



ఇలేగాంలో యోగాసనాలు నేర్చుకున్న నేను ఢిల్లీలోని కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులకు యోగా శిక్షణ ఇస్తున్న. పెళ్లి చేసుకుని ఢిల్లీలోనే స్థిరపడ్డాను. నా భాగస్వామి కూడా యోగా శిక్షణ ఇస్తోంది. యోగా నా జీవితాన్ని మార్చివేసింది. ఆరోగ్యం కోసం నేర్చుకున్న యోగా నాకు ఎంతో గుర్తింపు తెచ్చింది. టర్కి దేశంలోని ఇస్తాంబుల్ రాజధాని సమీపంలో విదేశీయులకు యోగా శిక్షణ ఇవ్వడం మరిచిపోలేను.

– కృష్ణకుమార్, ఇలేగాం

నాకు గర్వంగా ఉంది



26 ఏళ్ల క్రితం ఇలేగాం గ్రామానికి వెళ్లాను. అప్పట్లో బాపూజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాం. యువకులకు రోజూ యోగా శిక్షణ ఇచ్చేవాళ్లం. ఇప్పుడు ఆ గ్రామం నుంచి ఆరుగురు యోగా కోచ్‌లుగా మారారు. ఎంతోమంది యువకులు యోగాసనాలు వేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వారిని చూస్తే నాకు గర్వంగా ఉంది.

– నాగేశ్, మనోరమ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

జాతీయస్థాయిలో మెరిసిన గౌరి



జాతీయస్థాయిలో బంగారు పతకంతో గౌరి

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌కు చెందిన గౌరి యోగా పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించింది. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న గౌరి కోచ్ ఉప్పు రవీందర్ శిక్షణలో యోగాసనాల్లో మెళకువలు నేర్చుకుంది. దాదాపు నాలుగేళ్లుగా యోగాలో శిక్షణ పొందుతూ పలుసార్లు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. గత సెప్టెంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో స్థానం కైవసం చేసుకుంది. ఫిబ్రవరిలో పంజాబ్‌లోని లూధియానాలో యోగాసన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది.

ప్రశాంతంగా ఉండవచ్చు



లక్ష్మణచాంద: నిత్యం యోగా చేస్తే రోజంతా మానసికంగా ఎంతో ప్రశాంతంగా ఉండవచ్చు. శారీరక దృఢత్వం పెరుగుతుంది. నేను మూడు సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నాను. మండల స్థాయిలో పలుసార్లు ప్రశంసలు పొందాను.

– శ్రీనిత్య, కేజీబీవీ విద్యార్థిని, లక్ష్మణచాంద

ఆరోగ్యానికి మేలు



లక్ష్మణచాంద: పరీక్షల సమయంలో నిత్యం యోగా సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చు. యోగా మాలాంటి విద్యార్థినులకు ఎంతో మేలు చేస్తుంది. రెండు సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నాను. పలువురి చేత ప్రశంసలు పొందాను.

– అమూల్య, కేజీబీవీ విద్యార్థిని, లక్ష్మణచాంద

యోగా గ్రామం.. రోటిగూడ



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న హృషికేశ్‌తో తిరుపతి (ఫైల్)

జన్నారం: మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు యోగా పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి గ్రామంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. 2018లో మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో శివనూరి హృషికేశ్ పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. 2020లో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. 2024లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీహాస ద్వితీయ స్థానంలో నిలిచింది.

20 ఏళ్ల కష్టానికి ప్రతిఫలం



చెన్నూర్: ప్రాథమికవిద్య స్థాయి నుంచే యోగాలో శిక్షణ పొందాను. సుమారు 20 ఏళ్లుగా యోగాతో సహవాసం చేశాను. పది మందికి నేర్పించాలనే సంకల్పంతో యోగా టీచర్ కోర్సు చేశా. ఐదేళ్ల క్రితం శిక్షణ పూర్తి కాగా ఆయుష్ యోగా మందిరాల్లో శిక్షకుడిగా చేరాలని ప్రయత్నించా. ప్రస్తుత ప్రభుత్వం గతేడాది ఆయుష్ యోగా మందిర్‌లో శిక్షకుడిగా నియమించింది. యోగా టీచర్‌గా యోగా మందిరంతో పాటు వివిధ ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నా.

– మోర్ల మధూకర్, యోగా శిక్షకుడు

ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు



చెన్నూర్: సమయపాలన లేకుండా వివిధ పనులు చేస్తున్న ప్రజలు ఒత్తిడికి లోనై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతీరోజు ఉదయం, సాయంత్రం గంటపాటు యోగాకు కేటాయిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాల్సిన అవసరముంది. యోగాపై అవగాహన లేని వారంతా అంతర్జాతీయ యోగా డే సందర్భంగానైనా యోగా సాధన ప్రారంభించండి.

– ఇప్ప రజిత, ఆయుష్ యోగా మందిర్ శిక్షకురాలు

రిటైర్డయినా యోగా మాస్టర్‌గా..



యోగా మాస్టర్ భగవన్‌దాస్

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రాపల్లి భగవన్‌దాస్ పదేళ్లుగా యోగా సాధన చేస్తున్నారు. ఇతడి ప్రతిభను గుర్తించి బహుజన రైటర్స్ ఆధ్వర్యంలో బెస్ట్ యోగా మాస్టర్‌గా 2024లో హైదరాబాద్‌లో జాతీయ అవార్డు అందజేశారు. ప్రస్తుతం భగవాన్‌దాస్ మంచిర్యాల, లక్సెట్టిపేటలో శ్రీ యోగా ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి పలువురికి శిక్షణ ఇస్తున్నారు.

యోగాలో శ్రీనాథ్‌కు బహుమతులు

దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి శ్రీనాథ్ చదువుతో పాటు యోగాలో రాణిస్తున్నాడు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రవి ప్రోత్సాహంతో పలు యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాడు. జిల్లా, జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుపొందాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతి సాధించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.



ఆసనం వేస్తున్న శ్రీనాథ్



కల్లూరులో విద్యార్థులకు ఆసనాలు నేర్పిస్తున్న గజానన్

15 ఏళ్లుగా ఉచిత శిక్షణ

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన గజానన్ 15 ఏళ్లుగా యువకులు, మహిళలకు ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నారు. గతేడాది ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో మండలానికి ఇద్దరు శిక్షకులను ప్రభుత్వం నియమించింది. వారు ఆయా పాఠశాలల ఆవరణల్లో, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిత్యం యోగాలో మెళకువలు నేర్పిస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతీ గ్రామంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా సాధన తప్పనిసరిగా అవసరం. గ్రామగ్రామాన యోగాసనాలు నేర్చుకునేందుకు విద్యార్థులు ముందుకువస్తున్నారు.

– సిర్ల మౌనిక, శిక్షకురాలు, కుంటాల

- డీసీసీబీ మాజీ చైర్మన్ హరీశ్‌రావు కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్ట్

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లాలో ఈనెల 15న సంచలనం సృష్టించిన కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం కేసును నిర్మల్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిల వివరాలు వెల్లడించారు. మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ హరీశ్‌రావు వద్ద అదే గ్రామానికి చెందిన షేక్ హైదర్ 2005లో డ్రైవర్‌గా పనిచేసేవాడు. హైదర్ ప్రవర్తన నచ్చక ఆరు నెలలకే హరీశ్‌రావు పని నుంచి తీసివేశాడు. దీంతో షేక్ హైదర్ హరీశ్‌రావుపై పగ పెంచుకున్నాడు. గుంటూరు జిల్లాకు చెందిన బానాల ప్రిన్స్, విజయవాడకు చెందిన తట్టూరి రవి, కళకంటి సురేశ్, గూడె కోటేశ్వరరావుతో కలిసి హరీశ్‌రావును ఈనెల 15 అర్ధరాత్రి అతడి ఇంటి నుంచి కిడ్నాప్ చేశారు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న బంగారు చైన్, రెండు బంగారు బిల్లలు, డైమండ్ ఉంగరం, రూ.5వేల నగదు దొంగిలించారు. కారులో కత్తులతో బెదిరిస్తూ.. అతని బంధువులకు ఫోన్లు చేయించి రూ.3కోట్లు డిమాండ్ చేశారు. మార్గమధ్యలో మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద కారు ఆపగా హరీశ్‌రావు వారి నుంచి తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్పీ జానకీ షర్మిల వెంటనే ఏఎస్పీ రాజేశ్ మీనా నేతృత్వంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నాలుగు రోజుల వ్యవధిలోనే నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి కిడ్నాప్‌నకు వాడిన కారు, బాధితుడి కారు, బంగారు చైన్, బాధితుడి పర్సు, రూ.2వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, రెండు ఇంచుల ప్లాస్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్పీ రాజేశ్ మీనా, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, ఎస్సైలు ప్రదీప్, శ్రీనివాస్, లింబాద్రి, శ్రీకాంత్, అశోక్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా, రూరల్ సీఐ కృష్ణ

ఆర్జీయూకేటీకి 18,775 దరఖాస్తులు

- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

భైంసా: 2025–26 విద్యాసంవత్సరంలో ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు గడువు శనివారం ముగియనుంది. శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 18,775 దరఖాస్తులు వచ్చాయని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. చివరి రోజు మరిన్ని దరఖాస్తులు వస్తాయని పేర్కొన్నారు. జూలై 4న ప్రవేశాల మెరిట్ జాబితా విడుదల చేసి 7వ తేదీ నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పాత నిందితుడు అరుణ్ బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వస్తాద్ అరుణ్ అనే యువకుడిపై గతంలో కేసు నమోదు కాగా కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. శుక్రవారం పోలీసులు నిందితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అరుణ్ కోర్టుకు హాజరు కావాలని తెలుపగా ఇంటిలో లేడని తెలిపారు. ఈ క్రమంలో నిందితుడి కోసం గాలిస్తుండగా స్థానిక బస్టాండ్ వద్ద కనిపించాడు. పోలీసులు దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయగా అరుణ్ తన దగ్గరున్న బ్లేడుతో గొంతు కోసుకునే ప్రయత్నంలో గాయాలయ్యాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు అరుణ్‌ను అదుపులోకి తీసుకుని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. ప్రస్తుతం అరుణ్ చికిత్స కోలుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇతడు గతంలోనూ బ్లేడుతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనే ఎస్సై, హోంగార్డులపై దాడి చేసి గాయపరిచాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన దర్శ వెంకటేశ్ (22) గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్‌గా పనిచేస్తూ జీవించే వెంకటేశ్ ఏడాది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. పని మానేసి జులాయిగా తిరుగుతుండేవాడు. పని చేసుకోవాలని తల్లి చంద్రకళ ఎంత చెప్పినా వెంకటేశ్ తన పద్ధతి మార్చుకోలేదు. గురువారం సాయంత్రం మద్యం సేవించి వెంకటేశ్ ఇంటికి రాగా తల్లి మందలించింది. భోజనాల తర్వాత ఇంటి పక్కనే నివాసముండే తన పెద్దమ్మ భారతి ఇంట్లో నిద్రిస్తానని వెంకటేశ్ వెళ్లాడు. కొద్ది సేపటికే చంద్రకళ భారతి ఇంటికి వెళ్లి చూడగా వెంకటేశ్ ఇంటి పైకప్పు ఇనుప పైపునకు ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.